క్లుప్తంగా

రూ.16.18 కోట్లతో తాగునీటి పథకం

దాచేపల్లి : నగర పంచాయతీలో ప్రతి ఇంటికి తాగునీరు అందించేందుకు అమృత్ 2.0 పథకం ద్వారా రూ.16.18 కోట్లు మంజూరు అయ్యాయని నగర పంచాయతీ చైర్ పర్సన్ షేక్ మస్తాన్‌బీ ఖాదర్‌బాషా శనివారం తన కార్యాలయంలో తెలిపారు. స్థానిక శాసన సభ్యుడు కాసు మహేష్‌రెడ్డి ప్రత్యేక చొరవతో ఈ నిధులు మంజూరు అయ్యాయని, ఏప్రిల్ నాటికి టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి.. పనులు చేసేలా ఎమ్మెల్యే చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు. ఈ పథకం వల్ల దాచేపల్లిలోని 12,100 ఇళ్లకు కొళాయి కనెక్షన్లు ఇచ్చి.. శుద్ధి చేసిన తాగునీటిని నేరుగా అందిస్తామని తెలిపారు. ఈ పథకం వల్ల దాచేపల్లిలో తాగునీటి సమస్యలు పూర్తిస్థాయిలో పరిష్కారమవుతుందని తెలిపారు.

డీజిల్ సరఫరాకు టెండర్ల ఆహ్వానం

పిడుగురాళ్ల: పట్టణంలోని ఆర్టీసీ డిపోకు ప్రతి రోజూ 4000 లీటర్ల డీజిల్ సరఫరాకు ఆసక్తి గల వారు డిపోలో నిర్వహించనున్న టెండర్లల్లో పాల్గొనవచ్చునని డిపో మేనేజర్ ఎం.ముక్కేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. డిపో మేజర్ ఆఫీసు నందు టెండర్ ఫారం తీసుకొని జనవరి 22 నుంచి ఫిబ్రవరి 2వ తేదీ సాయంత్రం 2 గంటల లోపు సీల్డు కవర్లు బాక్స్‌లో వేయగలరని తెలియజేశారు. సాయంత్రం 4 గంటల తర్వాత బాక్స్ ఓపెన్ చేసి, లోకల్ రిటైల్ ప్రైజ్ మీద ఎక్కువ డిస్కౌంట్ ఆఫర్ చేసిన వారికి అవకాశం కల్పించడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని పిడుగురాళ్ల పరిసర ప్రాంతాలు, చుట్టుపక్కల ఉన్న పెట్రోల్ బంకు ఓనర్లు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

నైపుణ్యాభివృద్ధి శిక్షణను సద్వినియోగం చేసుకోండి

మాచర్ల: కృష్ణా జిల్లాలోని బొమ్ములూరులో డేటా ప్రో కంప్యూటర్స్ అనే ప్రైవేట్ సంస్థ ఆధ్వర్యంలో ఉచిత నైపుణ్యాభివృద్ధికి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మూడు నెలలపాటు ఉచిత శిక్షణలో 10వ తరగతి పాసైన విద్యార్థులకు కంప్యూటర్ కోర్సు హార్డ్‌వేర్ సిస్టమ్‌ను నేర్పించటం జరుగుతుందన్నారు. ఈ శిక్షణను పొందేందుకు ఆసక్తి గల అభ్యర్థులు ఫొటోలు, ఆధార్, రేషన్ కార్డు జిరాక్స్, కుల ధృవీకరణ, విద్యార్హత పత్రాలను తీసుకొని సంస్థ నందు సంప్రదించాలని కోరారు. వివరాలకు 9963311644, 9121613588 నంబర్లకు సంప్రదించాలని తెలిపారు.

గురజాల బస్టాండ్‌లో స్థలం లీజుకు టెండర్లు

మాచర్ల: గురజాల ఆర్టీసీ బస్టాండ్‌లో 4,677 చదరపు అడుగుల ఖాళీ స్థలానికి టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు మాచర్ల డిపో మేనేజర్ ఆర్.పిచ్చయ్య తెలిపారు. శనివారం ఆయన టెండర్ వివరాలను విలేకర్లకు తెలిపారు. గురజాల పట్టణంలోని ఆర్టీసి బస్టాండ్ తూర్పు భాగంలో ఖాళీగా ఉన్న స్థలానికి టెండర్లు ఆహ్వానించినట్లు తెలిపారు. టెండర్ వివరాలను ఏపీఎస్ ఆర్టీసీ వెబ్‌సైట్ ద్వారా తెలుసుకోవచ్చన్నారు. టెండర్‌కు సంబంధించిన సమాచారంలో ఏవైనా సందేహాలుంటే ఈ నెల 25న నెల్లూరులోని ఆర్టీసీ ఆర్ఎం కార్యాలయంలో హాజరు కావాలని కోరారు. ఫిబ్రవరి 2వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు టెండర్ స్వీకరిస్తామని, ఫిబ్రవరి 3న టెండర్లను ఫైనల్ చేయటం జరుగుతుందన్నారు. ఈ విషయాన్ని గమనించి టెండర్లలో పాల్గొనాలని డీఎం తెలిపారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

పిడుగురాళ్ల: మండలంలోని తుమ్మల చెరువు జడ్పీ ఉన్నత పాఠశాలలో వృన్నం హాస్పిటల్, చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు డాక్టర్ ఉనసం నాగ మల్లికార్జునరావు తెలిపారు. ఉదయం 9 గంటలకు శిబిరం ప్రారంభం కానున్నట్లు పేర్కొన్నారు. రోగులను పరీక్షించి ఉచితంగా ముందులను అందజేయటం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని తుమ్మలచెరువు, పరిసర గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోగలరని ఆయన తెలియజేశారు.

గుండెపోటుతో ఇన్‌చార్జి ఎంపీడీఓ మృతి


ఎంపీడీఓ సురేష్

మాచర్ల రూరల్: ఇన్‌చార్జి ఎంపీడీఓ కె.సురేష్ విజయ్‌కుమార్(54) శనివారం తెల్లవారు జామున గుండెపోటుతో మృతి చెందారు. బంధువుల వివరాల మేరకు.. స్వల్ప గుండె నొప్పి రావడంతో ఆయనను గుంటూరులోని ఓ ఆసుపత్రికి తీసుకెళ్లారు. చికిత్స అందిస్తుండగా..మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. సురేష్ మాచర్ల మండలంలో 2017లో సూపరింటెండెంట్‌గా బాధ్యతలు స్వీకరించారు. 2019 నుంచి ఇన్‌చార్జి ఎంపీడీఓగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శి పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి, ఎంపీపీ బూడిద శ్రీను, జడ్పీటీసీ పెద మల్లు స్వామి, కార్యాలయ సిబ్బంది సంతాపం వ్యక్తం చేశారు. ఎంపీడీఓ సురేష్‌కు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

సీఎం వైఎస్ జగన్‌తోనే సంక్షేమ పాలన

గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి


సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే మహేష్‌రెడ్డి

గురజాల: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రంలో సంక్షేమ పాలన సాధ్యమవుతుందని ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని తేలుకుట్ల గ్రామంలో శనివారం రెండవ రోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లిన ఎమ్మెల్యే మహేష్‌రెడ్డి.. మూడున్నరేళ్లుగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న పథకాలను వివరించారు. సమస్యలు ఉంటే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని ప్రజలను కోరారు. అర్హులైన వారికి సంక్షేమ పథకాలు అందకపోతే స్థానిక సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు చెప్పిన చిన్న చిన్న సమస్యలను పరిష్కరించాలని అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఎమ్మెల్యే సూచించారు. గత ప్రభుత్వంలో ప్రజలకు సంక్షేమ పథకాలు సక్రమంగా అందక ఎన్నో ఇబ్బందులు పడ్డారని గుర్తుచేశారు. జన్మభూమి కమిటీల పేరుతో సిఫార్సు లేఖలు ఉన్నవారికే సంక్షేమ పథకాలు అందించారని విమర్శించారు. అయితే ఇప్పుడు ఆ పరిస్థితి లేదన్నారు. ప్రతీ ఒక్కరికి సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. ప్రతి ఇంటికి ఏదో ఒక సంక్షేమ పథకం అందుతూనే ఉందని తెలిపారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో తమ దృష్టికి వచ్చిన సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని ఎమ్మెల్యే కాసు హామీ ఇచ్చారు. ముందుగా దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్.రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి యెనుముల మురళీధర్‌రెడ్డి, సీనియర్ నాయకుడు కొమ్మినేని వెంకటేశ్వర్లు, ఎంపీపీ కొమ్మినేని నారాయణమ్మ బుజ్జి, మండల కన్వీనర్ గాంధీ, పట్టణ కన్వీనర్ అన్నారావు, తేలుకుట్ల సర్పంచ్ తగుళ్ల వెంకమ్మ లక్ష్మయ్య, వైస్ సర్పంచ్ సన్నల కోటేశ్వరమ్మ కొండలు, గురజాల మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ తగుళ్ల పెద్ద పిచ్చయ్య, డీఎస్, వుడుముల శ్రీనివాసరెడ్డి, దుర్గెంపూడి రామిరెడ్డి, దొడ్డ నాగార్జునరెడ్డి, ఉడుముల శ్రీనివాసరెడ్డి, వెంకటేశ్వరెడ్డి, ఎంపీటీసీ వెంకటరెడ్డి అంజమ్మ, పుల్లారెడ్డి, రాఘవరెడ్డి, చల్లా వెంకటేశ్వర్లు, దాసరి లక్ష్మయ్య, ఎస్టీ విభాగం నాయకుడు బాణావత్ నాగేశ్వరరావు నాయక్, కో–ఆప్షన్ సభ్యుడు షేక్ పీర్ అహ్మద్, చలవాది నారాయణ తదితరులున్నారు.

ముగిసిన ఎడ్ల బల ప్రదర్శన

చివరి రోజు పాల్గొన్న 15 ఎడ్ల జతలు


ప్రథమ బహుమతి సాధించిన తంపల్లి ఎడ్ల జత

దుర్గి: శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి తిరునాళ్ల సందర్భంగా నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న ఎడ్ల బండ లాగుడు పోటీలు శనివారంతో ముగిశాయి. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో ఆరు పళ్ల విభాగంలో తంపల్లి గ్రామం, గన్నవరం మండలం, కృష్ణా జిల్లాకు చెందిన జొన్నలగడ్డ దేవా తాతారావు ఎడ్లు 3,931 అడుగుల దూరాన్ని 15 నిమిషాల్లో లాగి ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకున్నాయి. పల్నాడు జిల్లా, శావల్యాపురం మండలం ముత్తుకుపల్లి గ్రామానికి చెందిన ప్రసాద్‌కు చెందిన ఎడ్లు 3,881 అడుగుల దూరం లాగి ద్వితీయ స్థానంలో, గుంటూరు జిల్లా, ప్రత్తిపాడు గ్రామానికి చెందిన పమిడి అంజయ్య చౌదరి ఎడ్లు 3,639 అడుగుల దూరం లాగి మూడో స్థానంలో నిలిచాయి. చివరి రోజు మొత్తం 15 జతల ఎడ్లు పాల్గొనగా.. 11 జతలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం కొనసాగడానికి సహకరించిన దాతలు, పశు పోషకులు, రైతు సోదరులకు కమిటీ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు. రైతు సంఘం నాయకులు కటకం రామారావు, జి.గోపాలరావు, పర్యవేక్షణ చేశారు. రెఫరీగా గూడ శ్రీనివాసరావు, ఎం.నరేష్ వ్యవహరించారు.

కేజీబీవీ ఉపాధ్యాయురాలికి డాక్టరేట్


ఉపాధ్యాయురాలు జీపజే ప్రకాశిని

గురజాల : గంగవరం గ్రామం కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల తెలుగు ఉపాధ్యాయురాలు జీపజే ప్రకాశిని డాక్టరేట్ అందుకున్నారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో తెలుగు, ప్రాచ్య బాష విభాగంలో డాక్టర్ సీహెచ్ కళావతి పర్యవేక్షణలో పీహెచ్‌డీ పూర్తి చేసి డాక్టరేట్ పట్టాను అందుకున్నట్లు తెలుగు డిపార్టుమెంట్ హెడ్ డాక్టర్ ఇ.మాధవి తెలిపారు. డాక్టరేట్ అందుకున్న ఉపాధ్యాయురాలిని యూనివర్సిటీ ప్రిన్సిపల్ డాక్టర్ స్వరూప రాణి, ఆచార్య కేవీ కృష్ణారావు, డాక్టర్ పిల్లి వాసు, బలరాం, లలిత కుమారి, యశ్వంత్ కుమార్‌రెడ్డి, కేజీబీవీ పాఠశాల ఎస్‌వో జ్యోతి, ఉపాధ్యాయులు అభినందించారు.

ఉత్సవ కమిటీ చైర్మన్‌గా సత్య వెంకటరామిరెడ్డి

రెంటచింతల: స్థానిక రుక్మిణీ సత్యభామ సమేత శ్రీ వేణుగోపాల స్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవ కమిటీ చైర్మన్‌గా పల్లెర్ల సత్య వెంకటరామిరెడ్డి(రాంబాబు), సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఈఓ గాదె రామిరెడ్డి శనివారం తెలిపారు. కమిటీ సభ్యులుగా పూజల రామయ్య, కట్టమూరి వెంకట నాగేశ్వరరావు, మోదుగు శ్రీనివాసరెడ్డి, మద్దిరాల కృష్ణారెడ్డి, గొంటు ఆదిరెడ్డి, గుండా రామ్మూర్తి, పల్లెర్ల లక్ష్మారెడ్డి, పల్లెర్ల నర్సిరెడ్డి, మోర్తల ఉమామహేశ్వరరెడ్డి, నరమాల వెంకటేశ్వర్లు, పల్లెర్ల సత్యనారాయణరెడ్డి, మున్నా కొండలు, కాయితి వెంకటరెడ్డిలను ఎన్నుకోవడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా చైర్మన్ వెంకట రామిరెడ్డి మాట్లాడుతూ వార్షికోత్సవ వేడుకలను కనుల పండుగగా ఘనంగా నిర్వహించేందుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు గొట్టిపాళ్ల కృష్ణమాచార్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

పిడుగురాళ్ల: సైకిల్‌ను బైకు ఢీకొనటంతో ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలైన ఘటన పిడుగురాళ్ల పట్టణంలోని జూనియర్ కళాశాల సమీపంలో శనివారం జరిగింది. స్థానికుల వివరాల మేరకు.. కొండమోడు నుంచి పిడుగురాళ్ల వైపు సైకిల్‌పై వస్తున్నాడు. ఈ క్రమంలో రోడ్డు పక్కన ఆగి ఉన్న ఆటోను తప్పించి క్రమంలో.. సైకిల్‌ను వెనుక నుంచి కొండమోడుకు చెందిన ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. ద్విచక్ర వాహనంపై ఉన్న ఇద్దరు వ్యక్తులు రోడ్డుపై పడటంతో గాయాలయ్యాయి. స్థానికులు హుటాహుటిన క్షతగాత్రులను పట్టణంలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. ఈ ఘటనపై పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఎటువంటి కేసు నమోదు కాలేదని పట్టణ ఎస్ఐ పవన్‌కుమార్ తెలిపారు.

సెల్ టవర్ ఎక్కి.. కుటుంబం ఆత్మహత్యా యత్నం


టవర్ పైన ఉన్న జ్యోజి, అరుణ కృప దంపతులు, పిల్లలు

సత్తెనపల్లి: సెల్ టవర్ ఎక్కి ఓ కుటుంబం ఆత్మహత్యకు యత్నించిన ఘటన సత్తెనపల్లి పట్టణంలో శనివారం రాత్రి జరిగింది. దీంతో ఒక్కసారిగా పట్టణంలో కలకలం రేగింది. ఓ కేసు విషయంలో తమకు న్యాయం జరగలేదని, ఆత్మహత్య చేసుకుంటామంటూ తమ ముగ్గురు పిల్లలను దంపతులు సెల్‌టవర్‌పైకి తీసుకెళ్లి ఆందోళన చేపట్టారు. సమాచారం తెలుసుకున్న స్థానిక డీఎస్పీ బాధితులతో మాట్లాడి, న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో వారు కిందకు దిగారు.

వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని 31వ వార్డుకు చెందిన మల్లవరపు జ్యోజి, అరుణ కృప దంపతులు తమ ముగ్గురు బిడ్డలైన హోసన్న, శేషుబాబు, రేవతీలను తీసుకొని పట్టణంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద ఉన్న సెల్‌ఫోన్ టవర్‌ను శనివారం రాత్రి 8 గంటల సమయంలో ఎక్కారు. ఈ విషయం తెలుసుకున్న సత్తెనపల్లి డీఎస్పీ బి.ఆదినారాయణ పట్టణ సీఐ యు. శోభన్‌బాబు, ఎస్ఐలు, సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకున్నారు. సుమారు గంటన్నర పైగా ఐదుగురు టవర్ పైనే ఉన్నారు. పలుమార్లు సెల్‌ఫోన్‌లో పోలీసులు వారితో సంప్రదింపులు జరిపారు. మరో వైపు దళిత నాయకుడు రవితో కూడా మాట్లాడించి వారికి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో టవర్ పై నుంచి వారు కిందకు దిగారు. కుటుంబ సభ్యులకు ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో... పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు. ప్రధాన రహదారి పక్కనే కావడంతో పెద్ద ఎత్తున జనం గుమిగూడారు.

టవర్ ఎక్కడానికి కారణమేమిటంటే

మల్లవరపు జ్యోజి రైస్‌మిల్లు ఆపరేటర్‌గా, అతని భార్య అరుణ కృప కూలీగా పని చేస్తు జీవనం సాగిస్తున్నారు. కోవిడ్ సమయంలో పనులు లేకపోవడంతో అడపాదడపా దొరికే పనులకు వెళ్లారు. ఈ క్రమంలో ఈ నెల 3న అరుణకృప సత్తెనపల్లి మండలం నందిగామ అడ్డరోడ్డులోని వల్లభ రైస్‌మిలుల్లో పని కోసం వెళ్లింది. ఈ నెల 7న గోతాలు తీసే విషయంలో సూపర్‌వైజర్‌కు, ఆమెకు మధ్య గొడవ జరిగింది. అనంతరం మిల్లు యజమాని తల్లం సతీష్ ఆమెను పనిలోకి రావద్దని చెప్పాడంతో వాగ్వివాదం చోటు చేసుకుంది. దీంతో తనను కులం పేరుతో బూతులు తిట్టాడని అరుణ కృప తన భర్త జ్యోజికి చెప్పుకొని విలపించింది. దీనిపై సత్తెనపల్లి రూరల్ పోలీస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేయకుండా తాత్సారం చేస్తుండటంతో ఎస్పీని ఆశ్రయించారు. ఎస్పీ విచారణకు ఆదేశాలు ఇవ్వగా సత్తెనపల్లి రూరల్ సీఐ ఆర్.ఉమేష్ విచారణ చేసి వాగ్మూలాలను రికార్డు చేశారు. కులం పేరుతో దూషించిన ప్రస్తావన ఎక్కడా లేదని.. విచారణలో తేలినట్లు తెలిసింది. ఈ వ్యవహారంలో తమకు న్యాయం జరగడం లేదని మనస్థాపం చెందిన ఆ దంపతులు పిల్లలతో కలిసి ఆత్మహత్య చేసుకునేందుకు సెల్‌ఫోన్ టవర్ ఎక్కారు.

కేసు నమోదు చేసి, న్యాయం చేస్తాం

మల్లవరపు జ్యోజి, అరుణ కృప దంపతులను కులం పేరుతో దూషించినట్లు పది రోజుల క్రితం ఫిర్యాదు చేశారని, ఈ క్రమంలో తమకు న్యాయం జరగలేదని ఆత్మహత్యకు యత్నించారని సత్తెనపల్లి డీఎస్పీ బి.ఆదినారాయణ చెప్పారు. అరుణ కృపను కులం పేరుతో దూషించిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి న్యాయం చేస్తామన్నారు. నిందితుడిని కూడా అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. దీని వెనుక ఉన్న అసలు కారణాలు, రాజకీయ కోణంపై కూడా పోలీసులు విచారణ చేయనున్నట్లు తెలుస్తోంది.

ఓటు హక్కు.. ప్రతి ఒక్కరి బాధ్యత


మాట్లాడుతున్న తహసీల్దార్ డానియేలు, పక్కన కమిషనర్ శ్రీవిద్య

దాచేపల్లి : ఓటు హక్కు పొందడం ప్రతి ఒక్కరి బాధ్యతని తహసీల్దార్ మీసాల డానియేలు అన్నారు. స్థానిక వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో బీఎల్వోలు, సచివాలయం ఉద్యోగుల సమావేశం శనివారం నిర్వహించారు. ఈ నెల 26న జాతీయ ఓటరు దినోత్సవం జరపాలని, ప్రతి సచివాలయంలో ఈ కార్యక్రమం జరిగేలా చూడాలని ఆయన చెప్పారు. కొత్తగా ఓటు కోసం వచ్చే దరఖాస్తులు స్వీకరించాలని, ఈ విషయంలో బీఎల్వోలు నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దని ఆయన సూచించారు. ఈ సమావేశంలో కమిషనర్ అనిశెట్టి శ్రీవిద్య తదితరులున్నారు.

వృద్ధులకు చీరల పంపిణీ


చీరలు పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్మన్ వెంకట సుబ్బారావు

పిడుగురాళ్ల: వృద్ధులకు చేయూతనివ్వడం పలువురికి ఆదర్శనీయమని మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు అన్నారు. పట్టణంలోని శ్రీ సాయి వృద్ధాశ్రమంలో శనివారం ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు జూలకంటి శ్రీనివాసరావు ఆధ్వర్యాన 23వ వార్డు కౌన్సిలర్ శ్రీ రంగ రజని జన్మదినాన్ని పురస్కరించుకొని మహిళలకు, వృద్ధులకు చీరలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ చింతా వెంకట రామారావు, మార్కెట్ యార్డు డైరెక్టర్ పతంగి అమర్, ఆర్యవైశ్య నాయకులు జీవీ సుబ్బయ్య, వృద్ధాశ్రమ చైర్మన్ ఆత్మకూరి నరసింహమూర్తి పలువురు పాల్గొన్నారు.

సర్వీస్ రోడ్డు పరిశీలన

దాచేపల్లి: నగర పంచాయతీ పరిధిలోని పాత బస్టాండ్ సెంటర్‌లో ఉన్న సర్వీస్ రోడ్డును అధికారులు, ప్రజా ప్రతినిధులు శనివారం పరిశీలించారు. అద్దంకి–నార్కెట్‌పల్లి హైవేలోని ఈ సర్వీస్ రోడ్డు కొంత భాగాన్ని నిర్మించలేదు. ఈ విషయాన్ని స్థానిక ప్రజా ప్రతినిధులు ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. సంబంధిత అధికారులతో ఎమ్మెల్యే మాట్లాడారు. సర్వీస్ రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ క్రమంలో ఇంజినీర్లతో కలిసి నగర పంచాయతీ చైర్మన్ షేక్ ఖాదర్‌బాషా, మాజీ చైర్మన్ మునగా పున్నారావు, కమిషనర్ అనిశెట్టి శ్రీవిద్య సర్వీస్ రోడ్డును పరిశీలించారు. యుద్ధ ప్రతిపాదికన సర్వీస్ రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ప్రజాప్రతినిధులు కోరటంతో అధికారులు అందుకు అంగీకరించారు.

సబ్‌జైల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన జూనియర్ సివిల్ జడ్జి


ఖైదీలకు అందించే భోజనాన్ని పరిశీలిస్తున్న జూనియర్ సివిల్ జడ్జి మంజులత

గురజాల : సబ్‌జైల్‌ను జూనియర్ సివిల్ జడ్జి కె.మంజులత శనివారం ఆకస్మికంగా తనిఖీ చేపట్టారు. మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, 10వ అదనపు జిల్లా జడ్జి జి.వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు జైల్‌ను సందర్శించి ఖైదీలతో మాట్లాడారు. ఈ సందర్భంగా జూనియర్ సివిల్ జడ్జి.. ఖైదీలకు సకాలంలో భోజనం, వైద్య సదుపాయంపై అడిగి తెలుసుకున్నారు. బెయిల్‌పై వెళ్లిన వాళ్లు సత్ప్రవర్తనతో మెలగాలని ఖైదీలకు సూచించారు. అనంతరం వంటగదిని, స్టోర్ రూమ్‌ను, భోజనాన్ని పరిశీలించారు. న్యాయవాదులు కలివెల ప్రభుదాసు, సబ్‌జైల్ సూపరింటెండెంట్ సీహెచ్ వీఎస్ సుబ్బారెడ్డి, లోక్ అదాలత్ సిబ్బంది, జైల్ సిబ్బంది ఉన్నారు.

బాలల హక్కుల పరిరక్షణ మన బాధ్యత

బాలల హక్కుల పరిరక్షణ కమిటీ సభ్యురాలు బత్తుల పద్మావతి


సమావేశంలో మాట్లాడుతున్న బత్తుల పద్మావతి

పిడుగురాళ్ల: బాలల హక్కులను పరిరక్షించడం మన బాధ్యత అని బాలల హక్కుల పరిరక్షణ కమిటీ సభ్యురాలు బత్తుల పద్మావతి అన్నారు. పట్టణంలోని పాదుపు భవనంలో బాలల పరిరక్షణపై అవగాహన కార్యక్రమం ఐసీడీఎస్ ఆధ్వర్యాన శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బత్తుల పద్మావతి పాల్గొని, మాట్లాడారు. బాలల హక్కుల హరణ, బాల్య వివాహాలు, బాలికలపై హింసకు దిగే వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. చట్టాలపై బాల బాలికలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళా సంరక్షణాధికారులు, వెలుగు సిబ్బంది చట్టాలపై పూర్తిస్థాయిలో అవగాహన పెంచుకొని, బాల్య వివాహాలను పూర్తి స్థాయిలో నిర్మూలించేందుకు కృషి చేయాలని దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి సీడీపీవో జోత్స్న మేరిగోల్డ్, ఎంఈవో ఒంగులు రాజు, వెలుగు సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఐసీడీఎస్ సిబ్బంది, మహిళా కార్యదర్శులు పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని మన్నెం పుల్లారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాలల హక్కులపై విద్యార్థులకు బత్తుల పద్మావతి అవగాహన కల్పించారు. పౌష్టికాహారం, బాలికలు ఆత్మరక్షణపై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో ఒంగోలు రాజు, పాఠశాల హెచ్ఎం లింగాల ధనలక్ష్మీ, ఉపాధ్యాయులు ఎస్‌కే అలీం బాషా, ఎస్. సౌజన్య, ఎన్‌సీసీ ఆఫీసర్ ఎ. ఇమ్మానియేలు రాజు, ఐసీడీఎస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రూపుదిద్దుకుంటున్న వీరభద్రుని ఆలయం


నిర్మాణంలో ఉన్న వీరభద్రుని ఆలయం

కారెంపూడి: పల్నాటి రణక్షేత్రమైన కారెంపూడిలో వీరభద్రస్వామి ఆలయం రూపుదిద్దుకుంటోంది. చారిత్రక ప్రసిద్ధి చెందిన ఈ ఆలయం శిథిలావస్థకు చేరుకోవడంతో.. పదేళ్ల క్రితం తొలగించి నూతన ఆలయ నిర్మాణాన్ని చేపట్టారు. ప్రస్తుతం ఆలయం గోపురం పనులు పూర్తయ్యాయి. లింగాయత్ సమాజం భక్తులు ఆలయాన్ని నిర్మిస్తున్నారు. పల్నాటి వీర్ల అంకాలమ్మ గుడికి పడమరగా వీరభద్రుని ఆలయం ఉంది. ఆలయంలో వీరభద్రుడు కొలువుదీరే సమయం కోసం ప్రజలు ఎదురుచూస్తున్నారు.

ఆదర్శనీయుడు కామ్రేడ్ లెనిన్


లెనిన్ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

పిడుగురాళ్ల: ఆదర్శనీయుడు కామ్రేడ్ లెనిన్ అని సీపీఎం మండల కార్యదర్శి తెలకపల్లి శ్రీనివాసరావు పేర్కొన్నారు. పట్టణంలోని కన్నెగంటి హనుమంత్ భవనంలో కామ్రేడ్ లెనిన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి తెలకపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. కామ్రేడ్ లెనిన్.. జార్ చక్రవర్తులకు వ్యతిరేకంగా కార్మిక, కర్షక ఐక్యతకు పోరాడారని తెలిపారు. మార్క్స్ ఎంగిల్స్ సిద్ధాంతాలను ఆచరించి సమ సమాజాన్ని నిర్మించడంలో ఎనలేని కృషి చేశారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు కోటా సాయికుమార్, సాంబశివరావు, సీఐటీయూ నాయకులు భక్తుల వెంకటేశ్వర్లు, గోపయ్య, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

నాణ్యత విషయంలో ఉపేక్షించేది లేదు

రెంటచింతల: గ్రామాలలో ఏర్పాటు చేస్తున్న సీసీ రోడ్లు, కమ్యూనిటీ హాళ్ల నిర్మాణాల నాణ్యత విషయంలో రాజీ పడితే ఉపేక్షించేది లేదని క్వాలిటీ కంట్రోలర్ ఏఈఈలు ఓరుగంటి మరియ సుధాకర్ రెడ్డి, గుర్రం వెంకటేశ్వరెడ్డి స్పష్టం చేశారు. రెంటచింతల, గోలి, పశర్లపాడు గ్రామాలలో రూ.1.15 కోట్ల నిధులతో నిర్మించిన ఎస్సీ, బీసీ, మైనార్టీ కమ్యూనిటీ హాల్స్, పశర్లపాడు, గోలి గ్రామాలలో రూ.30 లక్షలతో వేసిన సీసీ రోడ్లు, పశర్లపాడులో రూ.75 లక్షల ఉపాధి నిధులతో ఏర్పాటు చేసిన సీసీ రోడ్ల నిర్మాణ పనుల నాణ్యతా ప్రమాణాలను క్వాలిటీ కంట్రోల్ అధికారులు పీఆర్ ఏఈ పాశం శ్రీనివాసరెడ్డిలతో కలిసి శనివారం పరిశీలించారు. అనంతరం విలేకర్లతో మాట్లాడారు. మూడు గ్రామాలలో మొత్తం రూ.2.20 కోట్లతో చేపట్టిన పనులను పరిశీలించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు పూజల పుష్పావతి రామయ్య, మున్నా చంద్రశేఖర్, వట్టికుంట లక్ష్మమ్మ, మండల పార్టీ అధ్యక్షుడు పూజల రామయ్య, యూత్ అధ్యక్షుడు గొట్టం చిన బ్రహ్మారెడ్డి, ఏరువ ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

23న వాసవి మాత ఆత్మార్పణ వేడుకలు

రెంటచింతల: స్థానిక శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో ఆర్యవైశ్యుల ఇలవేల్పు శ్రీ వాసవిమాత ఆత్మార్పణ దినోత్సవ వేడుకలను ఈ నెల 23న నిర్వహించనున్నట్లు దేవస్థానం అధ్యక్షుడు కట్టమూరి వెంకట నాగేశ్వరరావు తెలిపారు. శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. వివిధ గ్రామాలకు చెందిన ఆర్యవైశ్యులు అధిక సంఖ్యలో పాల్గొని, వాసవి అమ్మవారి దివ్యాశీస్సులు పొందాలని ఆయన కోరారు. ఈ కార్యకరమంలో దేవస్థానం పాలకవర్గ సభ్యులు నాళం చినబాబు, పల్సూరి శివరామకృష్ణ, దేవరశెట్టి వెంకటనర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

ఫిబ్రవరి 25న రాష్ట్రస్థాయి పాటల పోటీలు

పిడుగురాళ్ల: పట్టణంలోని ఏబీసీ సీబీఎస్ఈ స్కూల్ 12వ వార్షికోత్సవం సందర్భంగా ఆన్‌లైన్‌లో రాష్ట్రస్థాయి తెలుగు సినీ పాటల పోటీలను నిర్వహించడం జరుగుతుందని చైర్మన్ అయ్యంగార్ శనివారం తెలిపారు. జూనియర్ విభాగంలో 12 నుంచి 18 సంవత్సరాలు, సీనియర్ విభాగంలో 19 నుంచి 45 సంవత్సరాల వయస్సు ఉన్న వారు పాల్గొనవచ్చని తెలిపారు. మొదటి బహుమతి రూ.10 వేలు, రెండవ బహుమతి రూ.8 వేలు, మూడవ బహుమతి రూ.6 వేలు నగదుతో పాటు షీల్డ్, ప్రశంసా పత్రాన్ని అందించడం జరుగుతుందన్నారు. వివరాలకు 63046 99630 నంబరుకు సంప్రదించాలని తెలిపారు.

రోడ్డు విస్తరణకు సహకరించండి

పిడుగురాళ్ల: పట్టణంలోని రోడ్డు విస్తరణకు దుకాణాల యజమానులు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ ఎ.వెంకటేశ్వర్లు శనివారం తెలిపారు. గతంలో డివైడర్‌కు ఇరువైపులా 10.5 మీటర్ల రోడ్డు విస్తరణ చేపట్టేందుకు మున్సిపల్ అధికారులు సిద్ధమయ్యారు. దీంతో కొందరు కోర్టును ఆశ్రయించారు. కోర్టు వీరి అభ్యర్థనను కొట్టు వేసింది. సుమారు 51 దుకాణాల యజమానులకు డివైడర్ నుంచి 12.8 మీటర్ల మేర రోడ్డు విస్తరణకు నోటీసులు అందించడం జరిగిందని కమిషనర్ తెలిపారు. షాపు యజమానులకు అవసరమైతే నష్ట పరిహారం అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. షాపు యజమానులకు ఏమైనా సందేహాలు, సమస్యలు ఉన్నట్లు అయితే రాతపూర్వంగా మున్సిపల్ కార్యాలయానికి సమర్పించాలని కమీషనర్ తెలిపారు.

పిడుగురాళ్ల ప్రత్యేకాధికారిగా ఆంజనేయులు



పిడుగురాళ్లరూరల్: పిడుగురాళ్ల మండలం ప్రత్యేకాధికారిగా సీహెచ్ ఆంజనేయులు నియమితులయ్యారు. ఆయన స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం బాధ్యతలు చేపట్టారు. ఆయన పల్నాడు జిల్లా మైక్రో ఇరిగేషన్ అధికారిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్థానిక అధికారులతో కలిసి ప్రభుత్వ పథకాలను పేదలకు చేరే విధంగా చర్యలు చేపడతామన్నారు. అనంతరం వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు.

లాటరీ టిక్కెట్లు విక్రయిస్తున్న ఇద్దరి అరెస్ట్

పిడుగురాళ్ల: పట్టణంలో లాటరీ టిక్కెట్లు విక్రయిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసినట్లు పట్టణ సీఐ ఎం.మధుసూదన్‌రావు శనివారం తెలిపారు. పట్టణానికి చెందిన చల్లగుండ్ల ఇసాక్, దాసరి పాండు లాటరీ టిక్కెట్లు అమ్ముతుండగా అదుపులోకి తీసుకోవటం జరిగిందన్నారు. వారి నుంచి రూ.3,730 నగదు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు.